విశాలాంధ్ర విజయనగరం
పేజి నెం. 8
శుక్రవారం 28, ఫిబ్రవరి 2025

## 20 మద్యం బాటిళ్లతో ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

విశాలాంధ్ర-కొత్తవలస : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌లో బాగంగా డ్రైడే సందర్భంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ చేపట్టిన దాడుల్లో కొత్తవలస మండలంలోని దేశపాత్రునిపాలెం, గనిశెట్టిపాలెం గ్రామాలలో అక్రమంగా 20 మద్యం బాటిళ్లు కలిగివున్న జి.రామకృష్ణ, ఎ.కుమారి అనే ఇద్దరు వ్యక్తులును అరెస్ట్ చేసినట్లు కొత్తవలస ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ జీ.ఎస్.రాజశేఖర్ నాయుడు తెలిపారు. ఈ దాడుల్లో సబ్ ఇన్ స్పెక్టర్ వి.ఎన్.రాజు, సిబ్బంది హెచ్.సి ప్రసాద్, వీర్రాజు, బి.ఆదినారాయణ, జి.రమేష్, వి. పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## పేరుకుపోయిన చెత్త తొలగింపు

**విశాలాంధ్ర కథనానికి స్పందన**

విశాలాంధ్ర-కంటోన్మెంట్ విజయనగరం : విశాలాంధ్ర దినపత్రికలో బుధవారం వచ్చిన కథనానికి నగరపాలక సంస్థ అధికారులు స్పందించారు. నగరంలోని కాలువలో చెత్త పేరు పోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ దుర్గంధం వెదజల్లుతుందని, ఎవరూ పట్టించుకోవడంలేదని విశాలాంధ్రలో వచ్చిన కథనానికి నగరపాలక కమిషనర్ నల్లనయ్య స్పందించారు. వెంటనే పారిశుధ్య సిబ్బందిని, ఇంజనీరింగ్ అధికారులను ఆ ప్రాంతానికి పంపించి పేరుకుపోయిన చెత్తను తొలగించి మురుగునీరు సాఫీగా సాగేలా తగిన ఏర్పాట్లు చేశారు. ఎవరికైనా ఏదైనా సమస్య ఉంటే నేరుగా కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చునని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## కమనీయం శివపార్వతుల కల్యాణం

విశాలాంధ్ర-కొత్తవలస : మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని కొత్తవలస మండలంలోని తుమ్మికపల్లి గేటు వద్ద గల ఉమామహేశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం నిర్వహించిన శివపార్వాతుల కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. వేద పండితులు అంపోలు ఉమామహేశ్వర శర్మచే శివపార్వతుల కళ్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ, మాజీ ఎంపీపీ గొరపల్లి శివ, గ్రామ సర్పంచ్ విరోతి కొండలరావు, మాజీ సర్పంచ్ పిల్లా అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం పనులు సకాలంలో పూర్తి చేయాలి

**ఎంపీడీవో**

విశాలాంధ్ర-బాడంగి : మండలంలో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులు సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో రామకృష్ణ కోరారు. ఉపాధి హామీ పథకంలో బాగంగా నిర్వహిస్తున్న ఫారం పాండ్స్ పనులను క్షేత్ర స్థాయి లో గురువారం పరిశీలించటం జరిగింది పూడివలస మరియు డొంకినవలస గ్రామ పంచాయతీలకు హాజరు అయ్యా ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నటువండి ఫారం పాండ్స్ పనులను పరిశీలించటం జరిగింది.మన మండలానికి 2024-2025 ఆర్థిక సంవత్సరం కి 45 మొదట విడత,15 రెండవ విడత సాక్షన్ చేయటం జరిగింది.మొత్తం మీద 45 ఫారం పాండ్స్ ప్రారంభించడం జరిగింది. పెండింగ్ ఫారం పాండ్స్ పిన్నావలస మరియు బాడంగి-1 గ్రామ పంచాయతీలలో పున్నాయి. కావున సదరు లబ్దిదారులు త్వరితగతిన ఫారం పాండ్స్ పనులు ప్రారంభించాలని కోరారు.. ఆయనతోపాటు సాంకేతిక సహాయకులు శంకరరావు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో విజేతగా ఏనుగులపాలెం టీం

విశాలాంధ్ర-జామి: మండల కేంద్రమైన జామిలోని శ్రీఈశ్వరమ్మ పేరంటాలు, సింహాద్రి అప్పన్న స్వామి తీర్థ మహోత్సవాల నేపధ్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు స్థానికులను ఎంతగానో సంతోషపరిచాయి. రాష్ట్రంలోని వివిద జిల్లాలనుంచి అనేక బృందాలు ఈపోటీలలో పాల్గొన్నాయి. వీటిలో మొదటి బహుమతి రూ.10వేలుని ఏనుగులపాలెం టీం దక్కించుకుంది. రెండ బహుమతిని కుమరాం గ్రామనికి చెందిన టీం సాదించగా, మూడవ బహుమతిని వైజాగ్ టీం, నాల్గవ బహుమతిని కొత్తవలస టీంలు సాదించాయి. ఈపోటీలకు రిఫరీలుగా సూర్యారావు, బొబ్బిలిశ్రీను, గాలి చైతన్యకుమార్ వ్యవహరించారు. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు మాజీ జెడ్‌పిటిసి బండారు పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ బొబ్బిలి కోసం ప్రజలు పరిసరాలు పరిశుభ్రత పాటించాలి

**మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి**

విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణ ప్రజలు స్వచ్ఛ బొబ్బిలి కోసం పరిసరాలు పరిశుభ్రత పాటించి తడి చెత్త పొడి చెత్త వేరు చేసి మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి అందించాలని, పాలిథిన్ ప్లాస్టిక్ రహిత బొబ్బిలి కోసం ప్రజలు వ్యాపార వర్గాలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి పిలుపునిచ్చారు. గురువారం మున్సిపల్ కమిషనర్ లాలం క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా శానిటరీ ఇన్స్పెక్టర్, పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు మరియు వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీ లతో వెలమ వారి వీధి, మెహర్ కాలనీ మరియు రాజా కాలేజీ రోడ్డు నందు పర్యటించారు.వెలమవారి వీధిలో కాలువలలో సిల్ట్ తొలగించాలని, రోడ్లపై ఉన్న చెత్తలను తొలగించాలని, గార్బేజ్ వలనరబుల్ పాయింట్లను క్లియర్ చేయించాలని తెలియజేశారు. ఖాళీ స్థలంలలో చెత్తలు వేయకుండా చూడాలని మరియు స్థలం యజమానులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. రాజా కాలేజీ గ్రౌండ్ లో చెత్తలను వేస్తున్న వారిని గుర్తించి వారికి జరిమానాలు విధించాలని తెలియజేశారు.

## ఉచిత దర్శన పాసులు ఉండవు

విశాలాంధ్ర-చీపురుపల్లి : మార్చి 2 3 4 తేదీలలో చీపురుపల్లిలో జరగనున్న శ్రీశ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరలో ఈ ఏడాది ఉచిత దర్శన పాసులు లేవని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈవో బి శ్రీనివాసరావు గురువారం విలేకరులకు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం పది రూపాయలు 20 రూపాయలు 50 రూపాయలు వంద రూపాయలు కేటగిరీలలో ఈసారి అమ్మవారి దర్శనం టికెట్లను అమ్ముతున్నామన్నారు. ఆలయ ఆదాయాన్ని పెంపుదల దృష్టిలో పెట్టుకొని భక్తులకు అందుబాటులో ధరలను నిర్ణయించమన్నారు. వీఐపీల దర్శనార్థం ప్రత్యేక క్యూలైన్ మాత్రమే ఏర్పాటు చేస్తున్నామన్నారు. మిగిలిన క్యూ లైన్ లన్నీ టికెట్ల ధరలను బట్టి బార్కెట్లు ఏర్పాటు చేసి నిర్ణయించమన్నారు. అదేవిధంగా అధికారుల ఆదేశాల మేరకు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అత్యవసర వైద్య సేవలు అందజేయుట కొరకు ప్రత్యేక శిబిరాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులకు త్రాగునీరు ఇబ్బందులు లేకుండా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో త్రాగునీటి వస్తువులను భక్తులకు అందుబాటులో ఉంచామన్నారు. మార్కెట్ల వద్ద క్యూ లైన్ లో ఇటువంటి తుక్కులాట్లు జరగకుండా ఏర్పాట్లను పూర్తి చేస్తున్నామన్నారు. మార్చి నెల రెండు మూడు నాలుగు తేదీలలో భక్తులంతా అమ్మవారిని దర్శించుకుని వారి కోరికలు చెల్లించుకోవాలని ఈ సందర్భంగా ఈవో శ్రీనివాసరావు కోరారు.

## 31వ డివిజన్‌లో నగర పాలక కమిషనర్ పర్యటన

విశాలాంధ్ర-విజయనగరం : క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా గురువారం విజయ నగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య 31వ డివిజన్లో పర్యటించారు. ముందుగా రింగ్ రోడ్డు భాష్యం స్కూల్ నుండి ప్రారంభమైన పర్యటన నటరాజ్ కాలనీ తదితర ప్రాంతాల్లో సాగింది. ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణ ఏవిధంగా ఉన్నది అన్నది గమనించారు. కొన్ని కాలువలలో పూడికలు చేరిపోయి నిరుపయోగంగా ఉండడాన్ని గమనించి సిబ్బందికి మందలించారు. వెంటనే కాలువలన్నీ ప్రక్షాళన దిశగా చర్యలు చేపట్టాలని ప్రజారోగ్య సిబ్బందికి ఆదేశించారు. రహదారులను ఆక్రమించి చేపట్టిన తాత్కాలిక నిర్మాణాలను తక్షణమే తొలగించి వేయాలని ప్రణాళిక సిబ్బందికి ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము చేపడుతున్న క్షేత్రస్థాయి పర్యటనల్లో గుర్తించిన సమస్యలను వెనువెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. నగర క్రమబద్ధీకరణలో చేపడుతున్న చర్యలకు ప్రజలు కూడా తమ వంతు సహకారాన్ని అందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో నగరపాలక సంస్థ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర ఏర్పాట్లను ఎస్పీ పరిశీలన

విశాలాంధ్ర-చీపురుపల్లి : మార్చి నెల రెండు మూడు నాలుగు తేదీలలో అత్యంత వైభోగమేతంగా జరుగునున్న శ్రీశ్రీశ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర ఏర్పాట్లను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ గురువారం పరిశీలించారు. ఆలయానికి వచ్చే భక్తులు దర్శనార్థం ఆలయం వద్ద ఏర్పాటు చేయనున్న క్యూ లైన్‌ల వివరాలను ఈవో అని అడిగి తెలుసుకున్నారు. సాంస్కృతి కార్యక్రమాల నిర్వహణ సభాస్థలి వద్ద భక్తుల రద్దీని నియంత్రించేందుకు చేస్తున్న ఏర్పాట్లను ఆయన కమిటీ నిర్వాహకులు అడిగి తెలుసుకున్నారు. అమ్మవారిని దర్శించుకోవడం వచ్చే భక్తులు వాహనాలు పార్కింగ్ ఇతర ఏర్పాట్లపై స్థానిక పోలీసులను ప్రశ్నించారు. వీఐపీలు ఇతర వాహనాల పార్కింగ్ తోటపల్లి కాలువ వద్ద ప్రమాదాలు జరగకుండా రక్షణ కవచం ఏర్పాటు ఇతర అంశాలపై పోలీసులతో చర్చించారు. యాత్ర జరుగుతున్న మూడు రోజుల్లో ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలు జరగరాదని ఆలయ పరిసరాలు చుట్టూ ఎప్పటికప్పుడు గస్తీ ఏర్పాటుచేస్తూ మానిటరింగ్ చేయాలని పోలీసులను ఆయన ఆదేశించారు. ఈకార్యక్రమంలో డి.ఎస్.పి రాఘవులు, ఎస్సైలు ఎల్.దామోదర్‌రావు లోకేశ్వరరావు, కూటమి నాయకులు విసినిగిరి శ్రీనివాసరావు గవిడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల : ఎలక్ట్రికల్ ఏఈ

విశాలాంధ్ర-వంగర : నేడు శుక్రవారం 11కేవి సీతదేవి పురం ఫీడర్ లైన్ పరిధిలో గల గ్రామాల్లో విద్యుత్ సరఫరాను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ నిలిపివేయనున్నట్లు వంగర విద్యుత్ ఏఈ వి.సాంబశివరావు తెలిపారు. సీతాదేవిపురం 11 కేవి పరిధిలో ఉన్నటువంటి ఇరువాడ, చంద్రంపేట, చౌదరివలస, మరువాడ, కొత్త మరువాడ, సీతాదేవిపురం గ్రామాల పరిధిలో ఉన్నటువం టిఈ గ్రామాలలో విద్యుత్ లైన్ల కిందనున్నటువంటి చెట్లు,కొమ్మలు, మరమ్మతులు చేయనున్న నేపథ్యంలో ఉదయం 9 గంటల నుండి, మధ్యాహ్నం 2 గంటలవరకూ ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆయన వివరించారు. అందు వల్లనే ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నామన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## భక్తులతో కిటకిటలాడిన పుణ్యగిరి

**భక్తలకు ప్రసాద వితరణలో ఎమ్మెల్సీ ఇందుకూరి**

విశాలాంధ్ర-శృంగవరపుకోట : దక్షిణ కాశీగా పేరొందిన పుణ్యగిరి దేవస్థానం మహాశివరాత్రి మరుసటి రోజు కూడా గురువారం జనసంద్రంగా మారాయి. మహాశివరాత్రి సందర్భంగా జాగారం చేసిన భక్తులు బుధవారం రాత్రి 12 గంటల దాటిన నుండి కొండకు చేరుకోవడంతో ఆలయ పరిసర ప్రాంతాలు జనసంద్రంగా మారాయి. పుణ్యగిరి దేవస్థానం ప్రధాన అర్చకులు మణిశర్మ ఉమా కోటిలింగేశ్వర స్వామివారికి లింగోద్భావ సమయంలో ప్రత్యేక పూజలు చేశారు బుధవారం ఉపవాసాలు, జాగారాలు చేసిన భక్తులు రాత్రి 12 తర్వాత నుండి దర్శనానికి పోటెత్తారు. గురువారం ఉదయం జన ప్రవాహం బాగా పెరిగిపోయింది. దీంతో టికెట్ కౌంటర్, దార గంగమ్మ లోవ, కోటిలింగాల రేవు, పుట్టు దార మొదలగు ప్రాంతాలలో భక్తుల ప్రవాహం పెరిగి కోటిలింగాల రేవు వద్ద భక్తులు ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వచ్చింది. కొండపైకి వెళ్లేందుకు మెట్లమార్గం, కిందికి వచ్చేందుకు నూతనంగా నిర్మిస్తున్న రెగ పుణ్యగిరి రహదారి ద్వారా ఏర్పాటు చేసిన మార్గం గుండా భక్తులు కిందకు దిగేలా ఏర్పాటు చేశారు. పుణ్యగిరి కొండపైగల శ్రీ ఉమా కోటిలింగేశ్వర స్వామిని దర్శించుకోవటం కోసం వచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా చేయడంలో అన్ని శాఖలు కృషి చేశాయి ముఖ్యంగా పోలీస్, దేవాదాయ, పంచాయతీ శాఖలు పనితీరు బాగుందని భక్తులు తెలిపారు. తాసిల్దార్ అరుణ కుమారి, సిఐ నారాయణమూర్తి, ఎస్సైలు గంగరాజు, చంద్రశేఖర్, పంచాయతీ ఈఓ అనురాధ, పంచాయతీ సిబ్బందితో యాత్రికులకు పటిష్టమైన సేవలు అందించారు. వీరికి ఎన్సిసి క్యాండిట్లు తోడయ్యారు. వీరు సేవలో అందరి ప్రశంసలను అందుకున్నాయి. పుణ్యగిరిలో భక్తుల సంఖ్య అధికంగా ఉండటంతో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అక్కడ అధికారులు ప్రజల సౌకర్యార్థం చేసిన ఏర్పాట్లు సమీక్షించారు. అలాగే అక్కడ ఉన్న మెడికల్ క్యాంపు లో అందిస్తున్న మందుల గురించి అడిగి తెల్సుకున్నారు. అనంతరం దర్శనం చేసుకొని వచ్చిన భక్తులకి పుణ్యగిరి వేంకటేశ్వర స్వామి గుడి వద్ద ప్రసాద వితరణ చేసారు.

## ప్రశాంతంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక

**- జిల్లాలో 94.05 శాతం పోలింగ్**

**- పోలింగ్‌ను పర్యవేక్షించిన కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్**

విశాలాంధ్ర-విజయనగరం : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలో భాగంగా జిల్లాలోని 29 పోలింగ్ కేంద్రాల్లో గురువారం ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది. ఉదయం 8 గంటలకు ఆయా కేంద్రాల్లో పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. పోలింగ్ పూర్తయిన అనంతరం ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో మొత్తం 94.05శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలోని మొత్తం 5223 ఓట్లకుగాను 4912 ఓట్లు పోలైనట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.బి.ఆర్.అంబేద్కర్ వెల్లడించారు. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ పర్యవేక్షించారు. జిల్లా కేంద్రంలోని మహరాజా సంగీత, నృత్య కళాశాలలో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళిని కలెక్టర్ పరిశీలించారు. అక్కడ ఓటర్లకు చేసిన ఏర్పాట్లపై ఆర్.డి.ఓ.కీర్తి, తహశీల్దార్ కూర్మనాథరావులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోగాపురంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను సందర్శించి వెబ్ కాస్టింగ్ ద్వారా 29 కేంద్రాల్లో పోలింగ్‌ను మోనిటర్లలో పరిశీలించారు. ఈ సందర్భంగా విజయనగరంలో కలెక్టర్ డా.బి.ఆర్. అంబేద్కర్ మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని పోలింగ్ ప్రశాంతంగా జరుగుతున్నట్లు చెప్పారు. జిల్లాలోని 29 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 గంటలకు 19.34శాతం, మధ్యాహ్నం 12 గంటలకు 56.29శాతం, మధ్యాహ్నం 2 గంటలకు 78.42శాతం, మధ్యాహ్నం 4 గంటలకు 94.05 శాతం పోలింగ్ నమోదైనట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి విజయనగరం డివిజనులో 3038 ఓట్లు పోల్ అవ్వగా 93.22శాతం పోలింగ్ జరిగింది. బొబ్బిలి డివిజనుకు సంబంధించి 1011 ఓట్లు నమోదు కాగా 95.02 శాతం పోలింగ్ జరిగింది. చీపురుపల్లి డివిజనులో 863 ఓట్లు పోల్ కాగా 95.89 శాతం పోలింగ్ జరిగింది. జిల్లాలో మొత్తం 3270 మంది పురుష ఓటర్లలో 3084 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లాలోని 1953 మంది మహిళా ఓటర్లలో 1828 మంది ఓటు వేశారు. జిల్లాలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు నీడకోసం షామియానాలు, తాగునీటి సౌకర్యం, ప్రథమ చికిత్స ఏర్పాట్లు చేశామన్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను రెవిన్యూ డివిజనల్ అధికారులు, తహశీల్దార్‌లు పర్యవేక్షిస్తున్నట్టు పేర్కొన్నారు.

## జాతరలో భక్తులకు అసౌకర్యాలు జరగకూడదు

**టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు**

విశాలాంధ్ర-చీపురుపల్లి : మార్చి నెల రెండు మూడు నాలుగు తేదీలలో జరగనున్న శ్రీశ్రీశ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భక్తులకు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా చూడాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లి అధికారం ఆదేశించారు. గురువారం ఆయన పట్టణంలో లావే రోడ్డు నందు వెలసిన శ్రీ శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. అనంతరం యాత్రకు జరుగుతున్న ఏర్పాట్లను ఈవో శ్రీనివాస్, ఓటమి నాయకులతో కలిసి పరిశీలించారు. భక్తుల దర్శనం కోసం ఏర్పాటు చేయనున్న క్యూ లైన్‌లను, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించే ప్రదేశాలను, సాంస్కృతిక ప్రదేశాల నిర్వహణకు అనుకొని ఉన్న తోటపల్లి కాలువ వద్ద ఏర్పాటు చేసిన సేఫ్టీ వాళ్ నో ఆయన పరిశీలించారు. మూడు రోజులు పాటు జరుగునున్న జాతరలో సాంస్కృతి కార్యక్రమాల వద్దగాని, ఆలయం వద్దగాని చీపురుపల్లి పట్టణంలో చాలా వరకు అన్న మార్గమధ్యంలో గాని భక్తులకు ఏ విధమైనటువంటి అసౌకర్యాలు కలక్కుండా చూడాలని ఆయన సూచించారు. మార్చి నెలలో ఎక్కువగా ఎండలు ఉన్నందున భక్తులు ఎండ తాపానికి సమస్యలు పోయే ప్రమాదం ఉందని అందుకుగాను సంబంధిత చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే జాతరలో వినోద కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారిని ఏవిధమైనటువంటి ప్రమాదం సంభవించకుండా చూసుకోవాలని అన్నారు. వాహనాల రాకపోకలకు పార్కింగ్ ప్రదేశాలకు ఏపి రకాల చర్యలు తీసుకున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో ఈవో శ్రీనివాస్‌తోపాటు ఓటమి నాయకులు దన్నాన రామచంద్రుడు విషన్ గిరి శ్రీనివాసరావు గావిడి నాగరాజు, ముల్లు రమణ, పొట్నూర్ త్రినాధ మీసాల శ్రీధర్ నాయుడు, మహంతి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన జాతీయ స్థాయి స్టూడెంట్ టెక్నికల్ పేపర్ & ప్రాజెక్ట్ కాంటెస్ట్, ఎగ్జిబిషన్

విశాలాంధ్ర-రాజాం : జిఎంఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఈనెల 27, 28 తేదీలలో రెండు రోజుల పాటు నిర్వహించబడే జాతీయ స్థాయి విద్యార్థుల సాంకేతిక సదస్సు స్టైవ్‌కాన్-2025 మొదటిరోజు గురువారం జిఎంఆర్ఐటిలో ఘనంగా ప్రారంభమైనది. వరుసగా 17వ సారి నిర్వహిస్తున్న స్టైప్ కాన్-2025 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ఐ.టి.సలహాదారు, ఇండియన్ బ్లాక్ చైన్ స్టాండర్డ్స్ కమిటీ చైర్మన్ జే.ఏ.చౌదరి విచ్చేసారు. ఈసందర్భంగా చౌదరి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ జిఎంఆర్ఐటి అనేక మౌలిక సదుపాయాలతో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో మంచి వాతావరణంలో నిర్వహించబడుతున్న ఒక ఉన్నత విద్యాసంస్థ అని కొనియాడారు. 8 నుంచి 18 ఏళ్ల ప్రతిభావంతులైన గ్రామీణ యువకుల కోసం జూనికార్న్ ఏర్పాటు చేయబడిందని, 19 నుంచి 25 ఏళ్ల యువకులు అనేక రోజువారి సమస్యలకు పరిష్కారాలు వెతికేందుకు సిద్ధమవుతున్నారని చెప్పారు. 30 మంది 5 లేదా 6 నెలలపాటు చేసే ప్రాజెక్టుని ఐదు నిమిషాలలో పూర్తి చేయగల ఏఐ సాధనాలు మనకు లభ్యమవుతున్నాయని, వీటికి క్వాంటం కంప్యూటింగ్ తోడైతే రాబోయే రోజుల్లో మరింత డిసరప్షన్‌కి దారితీస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భగా ప్రిన్సిపాల్ డాక్టర్ సి ఎల్ వి ఆర్ ఎస్ వి ప్రసాద్ మాట్లాడుతూ తరగతి గది బయట మనం అనేక విషయాలను నేర్చుకోవచ్చని, కంఫర్ట్ జోన్ నుండి బయటకు వచ్చి పనిచేయాలని, కోర్, ఐటి లను మేళవించి నిత్యజీవితంలో ఉన్న అనేక సమస్యలకు పరిష్కార మార్గాలను పొందగలమని చెప్పారు. జిఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె గిరీష్ మాట్లాడుతూ కుతూహలం, ఆవశ్యకత, సృజనాత్మకతల వల్ల అనేక కొత్త పరిణామాలు, ఆవిష్కరణలు సాధ్యమయ్యాయని, ఏకాగ్రతతో, దూరదృష్టితో కృషిచేస్తే ఏదయినా సాధించవచ్చునని విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. జిఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సిఓఓ ఎల్ఎం.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞానంతో పాటు వినోదాన్నికూడా ఆస్వాదించాలని, ఈ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులందరూ ఎక్కువ ఈవెంట్‌లలో పాల్గొనడానికి ప్రయత్నించాలని సూచించారు. కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సిల్ ప్రెసిడెంట్ జి.కౌశిక్ స్వాగతోపన్యాసం చేయగా, కన్వీనర్ డా. జె శ్రీధర్ నివేదికను సమర్పిస్తూ దేశం నలుమూలల నుంచి 3884 విద్యార్థులు ప్రాజెక్ట్ ఎక్స్పో, స్టార్టప్ ఐడియా కాంటెస్ట్, పేపర్ ప్రజెంటేషన్, వర్కుషాప్స్ మొదలగు అంశాలలో ఈసదస్సుకు నమోదు అయినట్లు తెలిపారు.కార్యక్రమములో అసోసియేట్ డీన్లు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ మొదటి రోజు సాయింత్రం విద్యార్థులచే నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## ఎన్నికల సరళిని ఎంపీ కలిశెట్టి పరిశీలన

విశాలాంధ్ర-రాజాం : మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజక వర్గం ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ సూచనల మేరకు రాజాం నియోజక వర్గంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కోండ్రు జగదీష్, నియోజకవర్గం ఎమ్మెల్సీ పరిశీలకులు సీర రమణయ్య,కూటమి నాయకులు కలిసి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి గురువారం రాజాం, రేగిడి, వంగర, సంతకవిటిలో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియను పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా రాజాం ప్రభుత్వ హైస్కూల్‌లో ఎన్నికల సరళిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకపాటి రఘువర్మ తో కలిసి ఎన్నికలను పరిశీలించి, కూటమి నాయకులతో కలిసి పోలింగ్ బూత్ సమీపంలో ఏర్పాటుచేసిన శిబిరంలో కాసేపు కూర్చున్నారు. అనంతరం కోండ్రు జగదీష్, ఎమ్మెల్సీ పరిశీలకులు కలిసి వంగర, రేగిడిలో ఎన్నికలను పరిశీలించారు.అలాగే సంతకవిటిలో మాజీ తూర్పు కాపు కార్పోరేషన్ చైర్మన్ కొల్ల అప్పలనాయుడుతో కలిసి ఎన్నికల సరళిని పరిశీలించి, పోలింగ్ బూత్ సమీపంలో ఏర్పాటుచేసిన శిబిరంలో కూర్చున్నారు. ఉదయం 8నుంచి సాయంత్రం 4 వరకు ఏకదాటిగా కోండ్రు జగదీష్, ఎమ్మెల్సీ పరిశీలకులు సుడిగాలి పర్యటన కొనసాగిస్తూ నియోజకవర్గంలో ఎక్కడా కూడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా, పోలింగ్ జరిగే బూత్‌లను పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో కోండ్రు జగదీష్ మాట్లాడుతూ గత పాలనలో ఉపాధ్యాయుల హక్కులను వైసీపీ కాలరాసారన్నారు. నేడు కూటమి ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు మంచి రోజులు వచ్చాయన్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రఘువర్మ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఉపాద్యాయులకు ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేరుస్తారన్నారు.

**బాడంగి :** ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల సరళిని విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పల నాయుడు గురువారం బాడంగిలో పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ సరళిని స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు అడిగి తెలుసుకున్నారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తెంటు రవిబాబు, మాజీ ఎంపీపీ బొంతు తిరునాధనాయుడు, ఎల్.ఈశ్వరరావు, ఎల్.సత్యంతో పటు పలువురు ఎన్డీఏ బలపర్చిన అభ్యర్థి రఘు వర్మ గెలుపు కోసం కృషి చేశారు. వీరికి పోలింగ్ అయిన అంతవరకు జాగ్రత్తగా పని చేయాలని కోరారు. మండలంలో అత్యధిక ఓట్లు రఘువర్మ పడేవిధంగా కృషి చేయాలని కోరారు. ఇదెలా ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ మండలంలో సక్రంగా సవ్యంగా జరిగింది. బాడంగి పోలింగ్ స్టేషన్ పరిధిలో 61 ఓట్లు ఉండగా 60 ఓట్లు పోలింగ్ అయ్యాయి. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేవిధంగా గట్టి బందోబస్తు స్థానిక ఎస్సై తారకేశ్వరరావు చేపట్టారు. ఫలితంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రశాంతంగా పోలింగ్ జరిగింది.

## డిపార్ట్ మెంట్ ఆఫ్ బోటనీ ఆధ్వర్యంలో జాతీయ సదస్సు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : డిపార్ట్ మెంట్ ఆఫ్ బోటనీ ఆధ్వర్యంలో "కల్టివేషన్ ది ఫ్యూచర్ అడ్వాన్సెస్ ఇన్ ప్లాంట్ సైన్స్ అండ్ బయోటెక్నాలజీ ఫర్ సస్టైయినబిలిటీ 2025" అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ప్రారంభించారు. ఈ సెషన్‌లో ప్లాంట్ బయోటెక్నాలజీతో సుస్థిరత అనే అంశంపై జరిగిన సదస్సును ఇక్రిశాట్ మాజీ డీడీజీ-రీసెర్చ్, హైదరాబాద్ మరియు గ్లోబల్ రీసెర్చ్ డైరెక్టర్, ప్రసాద్ సీడ్స్ డా.అర్విండ్‌కుమార్ అభినందించారు. లక్నోలోని బీబీఏ యూనివర్సిటీ ఫిజియాలజీ అండ్ మాలిక్యులర్ బయాలజీ ఆఫ్ ప్లాంట్స్ (పీఎంబీపీ) ఎడిటర్ ఇన్ చీఫ్ ప్రొఫెసర్ రాణా ప్రతాప్‌సింగ్ మాట్లాడుతూ సదస్సు ప్రాముఖ్యత ప్రస్తుత పరిస్థితులలో ప్లాంట్ అండ్ అనిమల్ జీనోమ్ స్టడీస్ యొక్క ఆవశ్యకతను తెలియజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన హైదరాబాద్ విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పొదిలి అప్పారావు ప్రసంగిస్తూ వృక్ష శాస్త్రం, జంతు శాస్త్రాలలో రాబోయే మార్పులను గణమణిస్తూ మన పరిశోదనలు ఉండాలని, ఆయా పరిశోదనా ఫలితాలు ప్రజల అవసరాలకి అనుగుణ్యంగా అను సంధానం చేయాల్సి న అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. డాక్టర్ అనిరుధ్ కుమార్ సెమినార్ కన్వీనర్‌గా వ్యవహరించగా రిజిస్ట్రార్ తంత్రవాహి శ్రీనివాసన్, డీన్ ముక్కామల శరత్చంద్రబాబు, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ పరికిపండ్ల శ్రీదేవి ఇతర ఆద్యాపకులు, విద్యార్దులు పాల్గొన్నారు. ఈ సెమినార్‌లో హైదరాబాద్ సీసీఎంబీ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ హితేంద్ర కుమార్ పటేల్, లక్నో యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రశాంత్ కే సింగ్, విశాఖపట్నంలోని గీతం డీమ్డ్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కాల్వ మదన శేఖర్, వారణాసిలోని బీహెచ్యూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దేబాసిస్ దే, కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్ కృష్ణచైతన్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వి. కాన్పూర్ లోని ఛత్రపతి షాహు జీ మహారాజ్ యూనివర్సిటీ, అమర్ కంటక్ లోని ఐజీఎన్ టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుభా నారాయణ్ దాస్, కలబుర్గిలోని కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాకేశ్ కుమార్. సంబల్ పూర్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ జేఎస్ రమాదేవి, హైదరాబాద్ ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్ స్టిట్యూట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శాలిని ముదల్కర్, వరంగల్ నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పెరుగు శ్యామ్ పాల్గొని వివిధ అంశాలపై తమ పరిశోధనలను పంచుకున్నారు.

## రామతీర్థం రామస్వామి దేవస్థానంలో కిటకిటలాడిన భక్తజనం

**విశాలాంధ్ర-నెల్లిమర్ల :** రెండోరోజు గురువారం కూడా జనం పోటెత్తారు. శివరాత్రి సందర్భంగా భక్తులు జాగరణలు చేసి రామ తీర్థం రామస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం రామ కోనేరులో స్నానాలుచేసి తలనీలాలు సమర్పించి రామస్వామి, ఉమా సదాశివ స్వామి, బోడికొండ కోదండ రామ స్వామి ని దర్శించుకున్నారు. అంతకు ముందు రోజు దూర ప్రాంతాల నుంచి రాత్రి వచ్చిన భక్తులు కూడా తెల్ల వారు జామున మొక్కులు చెల్లించి సమీప తోటల్లో వంటలు చేసుకోని స్వంత గ్రామాలకు తరలి వెళ్లారు. జాతర లో నెల్లిమర్ల విస్తరణాధికారి శంకర్ జగన్నాథ్ ఆధ్వర్యంలో 12మంది పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో గ్రామపంచాయతీల నుండి వచ్చిన పారిశుధ్య కార్మికుల సహకారంతో రామతీర్థం లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా గ్రామపంచాయతీ పరిధిలో ఎప్పటికప్పుడు పారిశుధ్యం చేపడుతూ పరిసరాలను పరిశుభ్రం చేశారు.

## తప్పుడు కథనాలను ప్రసారం చేయడం సమంజసంకాదు

**పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున**

**విశాలాంధ్ర-విజయనగరం పోర్ట్ :** ఓటర్లకు బహుమతులు ఇస్తూ ప్రలోభపెడుతున్నారని సాక్షి చానెల్‌లో అబద్ధపు వార్తలను, తప్పుడు కథనాలను ప్రసారం చేయడం సమంజసం కాదని, పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. గురువారం తెలుగుదేశం పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లాలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పార్టీ నాయకులు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా బహుమతులు ఇస్తూ ప్రలోభపెడుతున్నారని సాక్షి చానెల్‌లో అబద్ధపు వార్తలను, తప్పుడు కథనాలను ప్రసారం చేయడం సమంజసం కాదని, పార్టీకి సంబంధించిన సభ్యత్వ కార్డులు వచ్చినట్టు స్వయంగా మంత్రి శ్రీనివాస్ వారికి తెలిపినప్పటికీ, వచ్చి పరిశీలించుకోవాలని కోరినప్పటికీ ఈవిధంగా అసత్య వార్తలు రాయడాన్ని పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున తీవ్రంగా ఖండించారు. అంతేకాకుండా అలాంటివారిపై చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## వాగ్దేవిలో కన్నులపండువగా మహాశివరాత్రి వేడుకలు

**అభిషేకాలు, హోమం, దీపాలంకరణ, చిన్నారుల నృత్యాలతో జాగరణ**

**విశాలాంధ్ర-కొత్తవలస :** కొత్తవలస మండలం తుమికాపల్లి వద్దనున్న వాగ్దేవి డిఫెన్స్ అకాడమీ కరస్పాండెంట్ కోటిన మహేశ్వరరావు, ఓం శాంతి బ్రహ్మకుమారీస్ సంయుక్త ఆధ్వర్యంలో మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని బుధవారం రాత్రి కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన వేడుకలు కన్నులపండువగా జరిగాయి. ముందుగా శివలింగ దీపాలంకరణ, హెూమాలు, చిన్నారులచే ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, రుద్రాభిషేకాలు,ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దామోదర సంజీవయ్య వైస్ ఛాన్సలర్ సూర్య ప్రకాష్, మాజీ వైస్ ఛాన్సర్ ముత్యాలనాయుడు, మాతాజీ, బ్రహ్మకుమారీస్ వాగ్దేవి విద్యాసంస్థలు డైరెక్టర్ ప్రవీణ్, ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ చంద్రమౌళి, ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ మాజీ ఎంపీపీ గొరపల్లి శివ, తుమికాపల్లి మాజీ సర్పంచ్ పిల్లా అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాగ్దేవి మహేష్ మాట్లాడుతూ కళాశాల ఆవరణలో ప్రత్యేక శివరాత్రి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం చాలా ఆనందంగా ఉందని, విద్యార్థినీ విద్యార్థులు వారి తల్లిదండ్రులు పూర్తిగా సహకరించడం బ్రహ్మకుమారిల ఉపన్యాసాలు వేద పండితులతో అభిషేక కార్యక్రమాలతో శివరాత్రి జాగరణ మహోత్సవం విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. అలాగే వివిధ గ్రామాల్లోని పలు దేవాలయాల్లో శివరాత్రి జాగరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

## మార్చి 15 నాటికి జిజిహెచ్‌కు ఆధునిక పరికరాలు : కలెక్టర్

**విశాలాంధ్ర-విజయనగరం టౌన్ :** జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జిజిహెచ్)కి మార్చి 15 లోపల ఆధునిక పరికరాలను అందించడం ద్వారా అదనపు సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా జిజిహెచ్ కు రూ.కోటితో అత్యాధునిక పరికరాలను అందించేందుకు కొవ్వాడ ఎన్‌పిసిఐఎల్ (న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్) ఇటీవలే జిల్లా కలెక్టర్‌తో ఎంఓయు కుదుర్చుకున్న విషయం తెలిసిందే. ఈ నిధులతో జిజిహెచ్‌లోని ఆపరేషన్ థియేటర్, న్యూరాలజీ, యూరాలజి, బయో కెమిస్ట్రి, అనస్థీషియా, ఇఎన్‌టి, జనరల్ సర్జరీ తదితర విభాగాలకు వివిధ పరికరాలను సమకూర్చనున్నారు. ఈ నిధుల వినియోగంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురువారం తమ ఛాంబర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ పరికరాల కొనుగోలుకు వారం రోజుల్లోగా టెండర్లను పిలవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో సిపిఓ పి.బాలాజీ, జిజిహెచ్ సూరింటిండెంట్ డాక్టర్ ఎస్.అప్పలనాయుడు, ఏపిఎంఎస్ఐడిసి ఈఈ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## పౌర సేవలను సకాలంలో అందించాలి : నగర పాలక కమిషనర్ నల్లనయ్య

**విశాలాంధ్ర-విజయనగరం :** పౌర సేవలను మరింత సమర్థవంతంగా, నిర్ణీత సమయాని కల్లా పూర్తయ్యే విధంగా చూడాలని ఎడ్యుకేషన్ కార్యదర్శులకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఈ మేరకు గురువారం కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మెరుగైన పౌర సేవలు అందించడమే సచివాలయాల ముఖ్య ఉద్దేశమని మరోసారి పునరుద్ఘాటించారు. అయితే కొంతమంది పౌర సేవలు సకాలంలో అందించడంలో నిర్లక్ష్యాన్ని వహిస్తున్నట్లు తాము గుర్తించామన్నారు. ఇక నుండి కాల పరిమితి మేరకు పౌర సేవలు అన్ని అందే విధంగా చూడాలన్నారు. అలసత్వం వహించే సిబ్బందిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏఓ సీతారామమూర్తి పాల్గొన్నారు.

## సుబ్బలక్ష్మి ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలలకు అన్నదానం

**విశాలాంధ్ర-కొత్తవలస :** మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా సుబ్బలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలం కేంద్రంలో ఉన్న చైతన్య బధిరల పాఠశాలలోని 50మంది చెవిటి, మూగ బధిరులకు గురువారం మధ్యాహ్నం, సాయంత్రం భోజనం ఏర్పాటుచేసినట్లు ట్రస్ట్ వవ్యస్థాపక అధ్యక్షులు కనకాల శివ తెలిపారు. అలాగే బలిగట్టం వద్ద ఉన్న న్యూ హెూప్ ఆశ్రమంలోని 42 మంది అనాథ పిల్లలకు కూడా రెండూ పూటలా భోజనం ఏర్పాటు చేసామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమనికి బెంగుళూరు వాస్తవ్యులు డి.విజయలక్ష్మి, లలితదేవి, తునుజ, సునీత తదితరులు ఆర్థిక సహాయం అందించినట్లు ఆయన తెలియజేసారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బంగారు రమేష్, పంచదార్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## 2న ఉత్తరాంధ్ర కనకదుర్గమ్మ ఆలయ ప్రతిష్ట

**విశాలాంధ్ర-కొత్తవలస :** కొత్తవలస మండలంలోని రామలింగాపురం (దేవాడ-ముసిరాం మధ్యలో) వద్ద స్వయంభువుగా వెలసి, ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవంగా పేరొంది. శ్రీ ఉత్తరాంధ్ర కనకదుర్గమ్మగా ప్రసిద్ధి చెందిన (శ్రీ తోటలోదుర్గమ్మ) అమ్మవారి నూతన ఆలయ ప్రతిష్ట మహోత్సవం మార్చి 2న వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు ఏడువాక వెంకటరమణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 28నుంచి ప్రత్యేక పూజలు, హెూమాలు, విశేష కార్యక్రమాలతో ప్రారంభమౌతాయని ఆయన పేర్కొన్నారు. మార్చి 2వ తేదీ ఆదివారం ఉదయం 7గంటల 26నిమిషాలకు శ్రీ దుర్గా దేవి, శ్రీ విఘ్నేశ్వర స్వామి, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్ల విగ్రహ, ఆలయ శిఖర ప్రతిష్ట, అదేరోజు మధ్యాహ్నం భారీ అన్నసమారాధన వంటి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో, శాస్త్రోక్తంగా చేపట్టిందుకుగానూ ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

## జాతరకు ముమ్మర ఏర్పాట్లు

**విశాలాంధ్ర-చీపురుపల్లి :** మార్చి నెల రెండు మూడు నాలుగు తేదీలలో చీపురుపల్లిలో జరగనున్న శ్రీ శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరకు సంబంధించి ఏర్పాట్లను నిర్వాహకులు ముమ్మరం చేశారు. చీపురుపల్లి పట్టణ పరిధిలోని శ్రీనివాస థియేటర్ జంక్షన్ నుండి గాంధీ బొమ్మ సెంటర్ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ప్రత్యేక విద్యుత్ దీప అలంకరణలను పూర్తి చేశారు. చీపురుపల్లి పోస్ట్ ఆఫీస్ ప్రాంగణం ఎదురుగా భారీ కట్ అవుట్‌ను ఏర్పాటు చేయగా, టీటీడీ దేవస్థానం వద్ద కూడా భారీ విద్యుత్ దీప అలంకరణలతో కటౌట్లను ఏర్పాటు చేశారు. అదేవిధంగా రావివలస కూడలి వద్ద, అమ్మవారి ఆలయ ప్రాంగణం ముఖద్వారం వద్ద, పుర్రె వలస జంక్షన్ వద్ద భారీగా ఆర్చుర నిర్మాణాన్ని చేపట్టారు. చీపురుపల్లి మూడు రోడ్ల కూడలి నుండి అమ్మవారి జాతర నిర్వహించే లావేరు రోడ్లో ప్రధాన రహదారికి ఇరువైపులా భారీ సెట్టింగ్‌లతో విద్యుత్ అలంకరణలతో కూడుకున్న దీపాలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా లావేరు రోడ్డు జంక్షన్ నుండి కోట దుర్గ గుడి ప్రాంతం వరకు కూడా విద్యుత్ దీప అలంకరణతో ఏర్పాట్లను పూర్తి చేశారు. ఇదిలా ఉండగా జాతర ప్రాంగణంలో మూడు రోజులపాటు లక్షలాదిమంది భక్తులు జాతరలో పాల్గొనడం ఉండడంతో వారి వినోద కార్యక్రమాల కొరకు పలు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రత్యేకించి జాయింట్ వీల్, చిన్నపిల్లల ఆటపాటలు సరదాల కొరకు వినోద కార్యక్రమాలను ఏర్పాట్లు చేస్తున్నారు. వినోద కార్యక్రమాలు జరిగే ప్రాంగణంలో ఎటువంటి తొక్కిసలాటలు జరగకుండా ముందస్తు చర్యలను చేపడుతున్నారు. ఇదిలా ఉండగా జాతరలో ఎటువంటి పేకాటలు బోకాటలు లేవంటూ పోలీసులు ఇప్పటికే హెచ్చరిక లను జారీ చేసినప్పటికీ కొంతమంది నిర్వాహకులు రాజకీయ ప్రలోభాలతో పోలీసుల నిబంధనలకు విరుద్ధంగా బెట్టింగ్ క్రీడలను నిర్వహించుటకు ఏర్పాటు చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. వినోద క్రీడా ప్రాంగణాలలో ఇటువంటి బెట్టింగ్ క్రీడాకారులు జరగకుండా పోలీసులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

## సచివాలయాల్లో పన్నుల బకాయిదారుల వివరాలు...

**నగర పాలక కమిషనర్ నల్లనయ్య వెల్లడి**

**విశాలాంధ్ర-విజయనగరం :** 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను ఇప్పటివరకు ఉన్న ఆస్తి పన్ను, ఖాళీ స్థలముల పన్నుల బకాయిదారుల వివరాలను విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయం నందు మరియు అన్ని సచివాలయాల పరిధిలో నోటీసు బోర్డులలో పొందుపరుస్తున్నట్లు కమిషనర్ పల్లి నల్లనయ్య వెల్లడించారు. ప్రభుత్వ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ కార్యదర్శి ఆదేశాల మేరకు అన్ని పురపాలక మరియు నగరపాలక సంస్థ కార్యాలయాలలో బకాయిదారుల వివరాలను వెల్లడిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఈరోజు నగర పరిధిలో ఉన్న అన్ని సచివాలయాల ఆయా పరిధిలో ఉన్న ఆస్తి మరియు ఖాళీ స్థలముల పన్నుల బకాయిదారుల వివరాలను ప్రకటించే నిమిత్తం నోటీసు బోర్డులలో ఆయా వివరాలు సిబ్బంది అతికించారు. పై విషయాలను ప్రజలు గమనించి ఆస్తిపన్ను బకాయిలను త్వరితగతిన చెల్లించి నగరపాలక సంస్థకు సహకరించవలసిందిగా ఆయన కోరారు. అలాగే ఇప్పటివరకు ఉన్న పన్ను బకాయిలను ఆయా హక్కుదారులకు తెలియపరిచే విధంగా డిజిటల్ నోటీసులను ఎస్ఎంఎస్‌లు ద్వారా గానీ, వాట్సాప్‌ల ద్వారా గానీ సమాచారం అందిస్తున్నట్లు తెలిపారు. ఆస్తిపన్ను వసూలు విషయమై మరింత ప్రజలలో మరింత చైతన్యం కల్పించేందుకు అవగాహన సదస్సులు కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సదస్సులలో ఆస్తి పన్ను చెల్లించడం వల్ల నగర అభివృద్ధికి ఏమేరకు దోహదపడగలదో అన్న విషయాలను వివరించనున్నట్లు చెప్పారు. అలాగే డిజిటల్ లావాదేవీలను కూడా ఏవిధంగా చేయవచ్చో వివరించ నున్నట్లు తెలిపారు. పన్ను చెల్లింపుదారులు నేరుగా నగరపాలక సంస్థ కార్యాలయాలలో సచివాలయాలలో గానీ పన్ను మొత్తాలను చెల్లించవచ్చని తెలిపారు. అలాగే డిజిటల్ లావాదేవీలు ద్వారా అనగా ఫోన్ పే,గూగుల్ పే వంటి ఆన్లైన్ చెల్లింపులను కూడా చేపట్టవచ్చని వెల్లడించారు. అదేవిధంగా 95523 00009 అనే నెంబర్ ను ప్రజల సెల్ ఫోన్ లో నిక్షిప్తం చేసుకుని, వాట్సాప్ ద్వారా ఆన్లైన్ చెల్లింపులు సులభతరంగా చేసుకోవచ్చని వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకొని వెంటనే పన్నులను చెల్లించి సహకరించాలని కోరారు. లేనిచో ఆంధ్రప్రదేశ్ నగరపాలక సంస్థ చట్టం 1955 లోని సెక్షన్ 269 (2) ప్రకారం ఆస్తి పన్ను బకాయిలున్న మొండి పన్ను బకాయిదారుల ఇండ్ల అత్యవసర సర్వీసులు అనగా మంచినీటి కొళాయి కనెక్షన్, కరెంటు కనెక్షన్ మున్నగునవి తొలగించడం జరుగుతుందని కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు.

## జాతరలో అన్నసమారాధన

**పాల్గొన్న ఎంపీపీ సురేష్ ముఖర్జీ**

**విశాలాంధ్ర-వంగర :** రాష్ట్ర నలుమూలలనుంచిసంగమేశ్వర స్వామివద్ద బుధవారంనుంచి జరుగుతున్న మహా శివరాత్రి జాతరకు తరలివచ్చిన భక్తులకు సంగమేశ్వర స్వామివారి ఆలయం పక్కనేఉచిత అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతరలోభాగంగా సంగమేశ్వర స్వామి దర్శనానికి ఈమహా శివరాత్రి మహోత్సవాలు జరిగిన అన్ని రోజులు ఈ మహాన్న దాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, ఈ కార్యక్రమంలో నిర్వాహకులకు అన్ని సహాయ సహకారాలు అందజేస్తున్న ఎంపీపీ సురేష్ ముఖర్జీ వెల్లడించారు. సంగాం సంగమేశ్వర స్వామి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. గురువారం జాతర ఘనంగా జరుగుతూ వస్తుంది. నాగావళి, వేగావతి, సువర్ణముఖి మూడు నదుల త్రివేణి సంఘమంలో స్నానమాచరించి శివుని దర్శనం చేసుకుంటే ఎంతో మోక్షం వస్తుందని నమ్మకంతో ఈ జాతరకు వేలాదిమంది భక్తులు తరలివస్తున్నారు. శివరాత్రి మహోత్సవానికి తరలివచ్చిన వేలాది భక్తుల కోసం పలువురు దాతలు ఈ రోజు జాతర ప్రాంతంలో మహా అన్నదాన కార్యక్రమం యదావిధిగా ఏర్పాటు చేశారు. భక్తులు అధికసంఖ్యలో అన్న ప్రసాదాన్ని సేవించారు. మన్యం పార్వతీపురం జిల్లా వీరఘట్టం మండలం నీలానగరం గ్రామ సర్పంచ్ మామిడిపల్లి పురుషోత్తం నాయుడు, ప్రతి ఏడాది గత కొన్ని సంవత్సరాలుగా ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. అన్నదానంలో భాగంగా ఈ సంవత్సరం కూడా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ అన్నసంతర్పణకు వంగర మండల ఎంపీపీ ఉత్తరవెల్లి సురేష్ ముఖర్జీ పాల్గొని భక్తులకు అన్నదాన సేవా కార్యక్రమం చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట సర్పంచ్ బండారుసత్యన్నారాయణ మూర్తి, శ్రీనివాసరరావులు, బలిజిపేట మండలం,చిలకలపల్లి గ్రామానికి చెందిన రంగబాబు, పార్వతిపురం మన్యం జిల్లా వీరఘ?వీరఘట్టం మండలం,వండవ సెంటర్ లో ఉన్న శిరిడి సాయి బాబా ధ్యాన మందిర ఆలయ ధర్మకర్త మజ్జి సింహాచలం లు ఆధ్వర్యంలో జాతరకు వచ్చే భక్తులకు మంచినీరు, మజ్జిగ, నిత్య మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో దాతలు, అన్న సంతర్పణ నిర్వాహకులు, పలువురు భక్తులు, పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

**విశాలాంధ్ర-కొత్తవలస :** కొత్తవలస మండలంలో గురువారం నిర్వహించిన ఉత్తరంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఏపీటీఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ, పిడిఎఫ్ అభ్యర్థి కొరెడ్ల విజయ గౌరీ, పిఆర్టియు అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడు తదితరుల మద్దతుదారులు పోలింగ్ స్టేషన్లకు 200 మీటర్ల అవతల శిబిరాలను ఏర్పాటు చేసి ఓటర్లకు ఓట్ల స్లిప్పులను అందజేశారు. సాయంత్రం ఎన్నికల సమయం ముగిసే సరికి కొత్తవలస మండలంలో 132 ఓటర్లకు గాను 126 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియో గించుకున్నారు. కొత్తవలసలో పోలింగ్ స్టేషన్‌ను తాసిల్దార్ బి.నీలకంఠరావు, ఎస్ఐ సుదర్శన్‌రావు, ఆర్ఐ రాజేష్, వీఆర్ఓలు రాధాకృష్ణ, రామానుజం, సుధీర్, కృష్ణమోహన్ తదితరులు పర్యవేక్షించారు. ఏపీటీఎఫ్ తరపున ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, ఎన్డీఏ కూటమి నాయకులు కోళ్ల రాంప్రసాద్, చొక్కాకుల అప్పారావు, గొరుపల్లి రాము, కోళ్ల శ్రీను, గొంప దుర్గాఉమేష్, మాకెన సీతారామపాత్రుడు (నవీన్), పి.వి.రత్నాజీ, మహాదాసు వెంకన్న, గంగరాజు, సూర్యనాకరాజు, అప్పికొండ శ్రీను, పిడిఎఫ్ తరపున యుటీఎఫ్ నాయకులు వెంకటనాయుడు, నిర్మల, సిఐటియు జిల్లా నాయకులు గాడి అప్పారావు, రామకృష్ణ తదితరులు, పిఆర్టియు తరపున నాయకులు గోవింద్ నాయుడు, ఈశ్వరరావు, ఈశ్వరఅప్పారావు తదితరులు శిబిరాల వద్ద తమ అభ్యర్థులకు మద్దతుగా హాజరయ్యారు. తమ అభ్యర్థుల గెలుపు పై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు.

**లక్కవరపుకోట:** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు

గురువారం ప్రశాంతంగా జరిగాయని తహసీల్దార్ డీఎంజీఎస్ ప్రసాద్ రావు తెలిపారు. మండలంలోని ఉపాధ్యాయ ఓటర్లు 63 మంది ఉండగా 61 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని సుమారు 96% పోలింగ్ జరిగినట్లు ఆయన తెలిపారు. ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ అంతా ప్రశాంతంగా నిర్వహించామని ఆయన తెలిపారు. అధికారులు, ప్రజాప ఈ పోలింగ్ నిర్వహణ కొరకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

**చీపురుపల్లి :** చీపురు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని 129 ఓటర్లకు గాను సాయంత్రం నాలుగు గంటల సమయానికి 121 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. చీపురుపల్లి ఎస్ఐఎల్ దామోదర్‌రావు ఆధ్వర్యంలో ఇటువంటి అవాంఛనీసం జరక్కుండా సజావుగా ఎన్నికలు నిర్వహించు కునేందుకు తగిన బందోబస్తును ఏర్పాటు చేశారు.

**తెర్లాం :** మండల కేంద్రంలో హైస్కూల్ ఆవరణలో

గురువారం ఉపాద్యాయ చట్టబద్ర ఎమ్మెల్సీ ఎన్నికలు పోలింగ్ తెర్లాం తహసీల్దార్ హేమంత్ కుమార్ దగ్గరుండి నిర్వహించారు. ఉపాధ్యాయులు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకున్నారని తహసీల్దార్ తెలిపారు. మొత్తం వోట్లు 82లో పురుషులు 64, మహిళలు ఉండగా 18 సాయింత్రం 4:00గంటలకు పోల్ అయిన ఓట్లులో పురుషులు 60, మహిళలు 17 ఓట్లు పోల్ అవ్వడం జరిగింది అని అని మొత్తం 93.9% పోల్ అయింది అని హేమంత్ కుమార్ తెలిపారు.

**రామభద్రపురం :** స్థానిక జిల్లా పరిషత్ స్కూల్లో గురువారం

జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ల ఓటింగ్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ప్రశాంతంగా జరిగింది. మత్త 81 ఓట్లు గాను77 పోలింగ్ 53 పురుషుల ఓట్లు 24 మహిళల ఓట్లు నమోదు నమోదయ్యాయి. నియోజకవర్గ ఎన్నికల అధికారి మధుసూదన రావు స్థానిక తాసిల్దార్ సులోచనారాయణి ఉదయము నుంచి పోలింగ్ అయ్యే వరకు పోలింగ్ కేంద్రం వద్ద ఉండి పోలింగ్ పరిశీలించారు. అలాగే పిడిఎఫ్ అభ్యర్థి విజయ గౌరీ, తెలుగుదేశం బలపరి చిన ఏపీటీఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అలాగే ఎంపీ కే అప్పలనాయుడు, పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. సిఐ నారాయణరావు ఎస్సై వెలమల ప్రసాదు పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి ఎటువంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్త వహించారు.

**వేపాడ :** మండల కేంద్రమైనవేపాడ జిల్లా పరిషత్ హై స్కూల్లో

జరుగుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ సందర్భంగా ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి గురువారం వేపాడ సందర్శించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా, ఏపీటీఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘు వర్మకి మద్దతుగా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిబిరం వద్ద ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి వేపాడ మండల తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి కూర్చున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పాఠశాలల అభివృద్ధి, ఉపాధ్యాయుల సంక్షేమం,విద్యా రంగంలో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి అభ్యర్థి విజయం కీలకమని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

**జామి :** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి మద్దతుతో

బరిలో ఉన్న పాకలపాటి రఘువర్మ విజయం ఖాయమని ఎస్‌కోట ఎమ్మెల్యే కోళ్ళలలితకుమారి అన్నారు. ఎన్నికల ఓటింగ్ జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం ఆమె జామిలోని రఘువర్మ వర్గీయులు ఏర్పాటు చేసిన శిబిరాన్ని సందర్శించారు. ఓటింగ్ సరళిని తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు కూటమి ప్రభుత్వం మద్దతుగా నలిచిఏందుకు నిర్ణయించుకున్నారని, దీంతో భారీ మెజారిటీతో రఘువర్మ గెలుస్తారని ఆమె అన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలలో కూటమి అభ్యర్థికి మంచి మెజారిటీ వస్తుందన్నారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పోలిపర్తి స్వామినాయుడు, ప్రధానకార్యదర్శులు వజ్రిరమణ, దనియాల పైడిరాజు, రాష్ట్ర కొప్పల వెలమ కార్పోరేషన్ డైరెక్టర్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి, టీడీపీ నేతలు కొత్తలి సూర్యారావు, గనివాడ ఎర్నాయుడు, గొర్లె ఎర్నాయుడు, రాయవరపు శ్రీను, బండారు జగన్, తెలుగుయువత అధ్యక్షుడు రాయవరపు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

**బొబ్బిలి :** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి

రఘువర్మ విజయం తథ్యమని కూటమి ఎమ్మెల్యే ఆర్‌విఎస్‌కెకె రంగారావు (బేబినాయన) అన్నారు. పట్టణం గొల్లపల్లిలో ఎన్నికల అధికారులు ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే. రంగారావు (బేబీ నాయన) సందర్శించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అత్యధిక ఓటింగ్ శాతం కలిగిన బొబ్బిలి పట్టణం మరియు బొబ్బిలి మండలానికి సంబంధించిన గొల్లపల్లి పోలింగ్ కేంద్రం వద్దకు వెళ్లి, పోలింగ్ ప్రక్రియను గురించి పార్టీ ఏజెంట్లు, నాయకులతో ఎమ్మెల్యే మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అక్కడ నుంచే మిగిలిన పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ శాతం, ఏర్పాట్లను గురించి వాకబు చేశారు. తెర్లాం, బాడంగి, రామభద్రపురం మండలాలలో దాదాపు 70-80% ఓటింగ్ పూర్తయిందని, బొబ్బిలిలో 95 శాతం జరిగిందని కూటమి బలపరిచిన అభ్యర్థి పాకలపాటి రఘువర్మ అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తారని తెలిపారు.

**రాజాం :** రాజాం ప్రభుత్వ హైస్కూల్లో ప్రశాంతంగా టీచర్స్

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరిగింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సెంటర్లో ఒక పోలింగ్ బూత్ ద్వారా టీచర్స్ తమ ఓటును సద్వినియోగం చేసుకున్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా 594 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా అందులో రాజాం మండలంలో 322 మంది ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదై ఉండగా వీరిలో పురుషులు 204, మహిళలు 106, మొత్తం 310 మంది ఉపాధ్యాయులు ఓట్లు వినియోగించుకోగా 96.27% పోలింగ్ అయ్యిందని ఎలక్షన్ బూత్ అధికారులు తెలిపారు.

**శృంగవరపుకోట :** గురువారం జరిగిన టీచర్స్ ఎమ్మెల్సీ

ఎన్నికలు మండలంలో గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికల పర్యవేక్షణ రాలు తాసిల్దార్ అరుణకుమారి తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని గవర్నమెంట్ హై స్కూల్లో ఏర్పాటుచేసిన 71వ పోలింగ్ బూత్ నకు మండలంలోని మొత్తం 189 ఓట్లకు గాను 184 ఓట్లు పోలయ్యి ఓట్ల శాతం 97.35 గా నమోదయింది.

**వేపాడ :** మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో

గురువారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈ ఎన్నికల్లో 48 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 47 మంది ఉపాధ్యాయులు మాత్రమే ఓటు హక్కును, వినియోగించుకున్నారు. ఇందులో 35మంది పురుషులు ఉండగా 12మంది స్త్రీలు కలరు. వల్లంపూడి పోలీసుల సారధ్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కేవలం ఒక్క ఓటర్ మాత్రమే ఓటు హక్కును వినియోగించుకోలేదు. దీంతో ఇక్కడ 99 శాతం ఓటింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏకపక్షంగా ఓటింగ్ జరిగినట్లు ఉపాధ్యాయులు తెలపడం విశేషం.

**గంట్యాడ :** గంట్యాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిసాయి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్లు 150కి గాను ఉపాధ్యాయ ఓటర్లు 149 ఓట్లు వినియోగించుకున్నారు 99.33 శాతం పోలింగ్ అయింది గంట్యాడ తాసిల్దార్ నీలకంఠేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి.

**మెరకముడిదాం :** మెరకముడిదాం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ

ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికలు అసిస్టెంట్ రిటర్నింగా అధికారి అజురఫీ జాన్ ఆధ్వర్యంలో జరిగాయి. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభం అయ్యింది. ఒంటి గంట సమయానికి 55 ఓట్లుకు గాను 23 మాత్రమే ఓట్లు పోలయ్యాయి. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా బుదరాయవలస పోలీస్ సిబ్బంది ఎస్ఐ లోకేష్‌కుమార్ అన్ని ఏర్పాట్లు చేశారు. దీంతో ఇటు రాజకీయ నాయకులు, అటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఏదిఏమైనా ఎన్నికలు ప్రశాంతగా జరగటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నట్లయ్యింది.